క్లుప్తంగా

గృహనిర్మాణాలను పూర్తి చేయాలి - జేసీ శ్రీనివాసులు



గృహ నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న జేసీ శ్రీనివాసులు

బంగారుపాళెం: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం సాయంత్రం హౌసింగ్, సచివాలయ సిబ్బందితో గృహ నిర్మాణాల పురోగతిపై సచివాలయాల వారీగా జేసీ సమీక్షించారు. మండలంలో గృహ నిర్మాణ పనుల పురోగతి తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకునేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు బ్యాంకుల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో 3,184 మందికి గృహాలు మంజూరు కాగా 119 ఇళ్లకు స్టేజ్ కన్వర్షన్ జరిగిందని హౌసింగ్ అధికారులు జేసీకి వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఈ సుబ్రమణ్యం, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏఈ గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేస్తున్న దాత, టీచర్లు

బంగారుపాళెం : మండలంలోని మడుపోలూరు ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం విద్యార్థులకు గ్రామానికి చెందిన జయచంద్రనాయుడు రూ 5 వేల విలువైన పలకలు, బలపాలు, నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, టేబుల్స్ పుస్తకాలను మంగళవారం వితరణ చేశారు. వీటిని హెచ్ఎం అనిత, సీఆర్‌పి సుధాకర్‌శెట్టి పిల్లలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నారసింహనపల్లెలో 'మహాభారత యజ్ఞం'



హరికథాగానం చేస్తున్న భాగవతార్ ఉషారాణి

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల గుడిలో మహాభారత యజ్ఞం ప్రారంభమైనట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. జూలై 9వ తేదీ వరకు వీటిని నిర్వహించనున్నట్టు చెప్పారు. తిరుపతి వాస్తవ్యులు భాగవతార్ ఎస్. ఉషారాణి హరికథాకాలక్షేపం, రాత్రి శ్రీ వెంకటేశ్వర నాట్య కళామండలి కళాకారుల నాటక ప్రదర్శనలు ఉంటాయని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్ : చిత్తూరు మండలం తుమ్మింద జెడ్పీ హైస్కూలులో మంగళవారం 'అపోలో' నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్యులు శ్రీహిత, వేద మానస, సాయి నిత్య, అల్లి, డినేష్ మొత్తం 142 మందిని పరీక్షించి మందులు అందజేశారు.

రైతులకు రాయితీతో డ్రిప్ పరికరాలు



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

గుడిపాల: రైతులకు 90 శాతం రాయితీతో డ్రిప్ పరికరాలను ప్రభుత్వం ఇస్తోందని మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ సతీష్ అన్నారు. మంగళవారం వసంతాపురం, బసవాపల్లె సచివాలయాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైతులకు అందుబాటులో డ్రిప్ పరికరాలు ఉన్నాయని, ఇవి కావలసిన వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసి, 10 శాతం వాటాను డీడీ తీసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు సోనియా, వాణిశ్రీ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

తవణంపల్లె: మండలంలోని నలిశెట్టిపల్లె పంచాయతీలో బుధవారం ఉదయం 6.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు నిర్వహిస్తారని ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు.

పూతలపట్టు మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ వ్యక్తి (టీడీపీ సానుభూతి పరుడు) 2018లో పక్కా ఇళ్లు మంజూరు చేయించుకుని 2019లో మోల్డింగ్ వేశాడు. అయితే మరో ఇల్లు కట్టుకునేందుకు స్కెచ్ వేశాడు. ఇందుకుగాను చనిపోయిన వ్యక్తి ఆధార్‌ను ఉపయోగించి, అతనికి మంజూరైన ఇంటి నిర్మాణాన్ని ఆన్‌లైన్ నుంచి తొలగించేలా చేశాడు. దీనికిగాను అతను ఆ ఉద్యోగికి రూ. 25వేలు ముట్టజెప్పాడు. ఈ కిరికిరితో అదే రేషన్ కార్డు, ఆధార్ కార్డును ఉపయోగించి పక్కా ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేయించుకున్నాడు.

– అలాగే జనమ్మ(పేరుమార్చాం) అనే మహిళకు కూడా టీడీపీ ప్రభుత్వంలో ఇల్లు మంజూరైంది. అప్పట్లోనే ఇంటి పని కూడా పూర్తి చేశారు. తర్వాత ఓ ఉద్యోగి సాయంతో ఆ మంజూరును చనిపోయిన ఓ వృద్ధురాలి పేరుకు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు. 2020లో మళ్లీ అదే రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఉపయోగించి ఇల్లు పొందారు. ఇందుకు ఆ ఉద్యోగికి రూ. 20వేలు సమర్పించారు. ఇలాంటివి మండలంలో వందల సంఖ్యలో ఉన్నాయి.

దోచేస్తున్నాడు..భాయ్!

– హౌసింగ్ శాఖలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతి కొత్తపుంతలు తొక్కుతోంది.. ఇళ్ల విషయంలో అవసరం, డిమాండ్ బట్టి అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలొస్తున్నాయి. ఉన్నతాధికారుల అండతో ఈ దందా నడుస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. దాదాపు మూడున్నరేళ్లుగా పనిచేస్తున్న అతడు హౌసింగ్‌లో ఏం చెబితే అది చేయాల్సిందేనట!

- ఇళ్ల నిర్మాణంలో మాయజాలం
- చేయి తడిపితే ఆధార్ కూడా తారుమారు
- మంజూరు పేరుతో వేలల్లో దండుకుంటున్న వైనం



పూతలపట్టు మండలంలో జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

యాదమరి/పూతలపట్టు: పూతలపట్టు మండలంలో 1,875 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 900 వరకు మాత్రమే అనుమతులు ఇచ్చారని అధికారులు లెక్కలు చెబుతున్నారు. అయితే గత ప్రభుత్వంలో హౌసింగ్ శాఖ అధికారులు అవినీతి ముద్ర వేసుకున్నారు. ఇళ్ల మంజూరుకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి బిల్లు మంజూరుకూ డబ్బులు గుంజేవారు. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు నగదు జమ అవడం ఆలస్యం..వారి ఇళ్లముందు వాలిపోయేవారు. సిమెంట్ బ్యాగులను పక్కదారి పట్టించి, సొమ్ము చేసుకున్నారు. అంతేకాకుండా ఇళ్లు మంజూరై..బిల్లు చేసుకున్న వారికి మళ్లీ ఇళ్ల నిర్మాణాలు చేయించడం చర్చనీయాంశమైంది.

అది ఎలా చేశారంటే..

ఉదాహరణకు...ఆధార్ నంబరు 56456000042(నంబరు మార్చాం)తో 2018లో ఇళ్లు మంజూరైంది. రూ.1.50 లక్ష వరకు బిల్లులు చేసుకున్నారు. దీంతో పాటు 30 బ్యాగుల సిమెంట్ కూడా తీసుకున్నారు. మళ్లీ ఇదే నంబరుతో 2022లో కూడా అదే ఆధార్‌తో ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తు చేశారు. ఆన్‌లైన్‌లో ఎలిజిబులిటీ ఉందని చూపడంతో ఈ దరఖాస్తును ఓ ఉద్యోగి ముందు వరుసలో పెట్టారు.

గతంలో పక్కా ఇల్లు మంజూరై ఉంటే మళ్లీ ఆ మంజూరును ఆన్‌లైన్‌లో తొలగిస్తారు. ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు మండల స్థాయి నుంచి జిల్లాకు లింక్ ఉంది. గతంలో ఇళ్లు మంజూరైన వ్యక్తి పాత మంజూరును రద్దు చేసుకోవాలంటే చనిపోయిన ఆధార్ తీసుకొస్తే క్షణాల్లో తొలగిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి ఆధార్‌కు లింక్ అయినా ఫోన్ నంబరుకు ఓటీపీ వస్తుంది. ఈ నంబరు చెబితే నెల రోజుల్లో ప్రక్రియ మొత్తం పూర్తవుతుంది. ఆ తర్వాత ఇళ్ల నిర్మాణానికి అర్హతగా చూపిస్తున్నారు. ఇందుకు ప్రతిఫలంగా సిబ్బంది రూ. 30 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఈ దందాలో పలువురికి వాటాలు ఉన్నాయని సమాచారం. దీంతో పాటు సిమెంట్ బ్యాగులను దొడ్డిదారిన అమ్మేస్తున్నారు. లబ్ధిదారులకు ఇచ్చే ఇసుకలో కిరికిరి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బిల్లు పడితే చేయి తడపాల్సిందేనని కొందరు డిమాండ్ చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి.

పెత్తనం అంతా ఆ ఒక్కడిదే..!

హౌసింగ్ శాఖలో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న నియోజకవర్గ స్థాయి ఉద్యోగిర్ కనుసన్నల్లో ఇక్కడ దందా, వసూళ్లు, పెత్తనం సాగుతోందని బాహాటంగా చెబుతున్నారు. పూతలపట్టు, ఐరాలలో కూడా తాను చెప్పిందే వర్క్ ఇన్‌స్పెక్టర్ చేయాలనే అల్టిమేటం కూడా ఇస్తున్నాడట! వర్క్ ఇన్‌స్పెక్టర్లపై అతను జులుం చేస్తున్నట్టు తెలిసింది. అతడి అవినీతి, అక్రమాలు ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.

ఓహ్..అతడేనా!?

పూతలపట్టు, ఐరాల మండలాలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి అవినీతి వ్యవహారంపై హౌసింగ్ డీఈ సుబ్రమణ్యంను వివరణ కోరగా.. 'పూతలపట్టు మండలంలో ఆ వ్యక్తేనా!?' అని డీఈ అతడి పేరుతో సహా చెప్పడం గమనార్హం! హౌసింగ్‌లో ఎవరైనా అవతవకలు పాల్పడితే చర్యలు తప్పవని, లబ్ధిదారులకు సమస్యలు ఉంటే నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వరసిద్ధునికి విరాళాలు



రూ.1.27లక్షలు విరాళమిస్తున్న ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులు



గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళమిస్తున్న శ్రావణ్ కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామికి భక్తులు రూ.2.27లక్షలు విరాళం ఇచ్చారు. నిత్యాన్నదానానికి మదనపల్లెకు చెందిన ప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులురూ.1.27లక్షలు, హైదరాబాద్‌లోని బోడబండ్లకు చెందిన నీలా శ్రావణ్ కుటుంబ సభ్యులు గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.లక్ష వేర్వేరుగా ఆలయ అధికారులకు అందజేశారు. వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ రంగస్వామి, ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ



మట్టినమూనాలను సేకరిస్తున్న ఏఓ, సిబ్బంది

గుడిపాల: మండలంలోని ఆర్బీకేల ఆధ్వర్యంలో పొలాల్లో మట్టి నమూనాలను సేకరిస్తున్నట్లు వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మంగళవారం చీలాపల్లెలో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రతి ఆర్బీకేలో 25 మట్టినమూనాలను సేకరించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 278 మట్టి నమూనాలు సేకరించామన్నారు. అనంతరం భూసార పరీక్షల ఆవశ్యకత, ప్రయోజనాలను రైతులకు వివరించారు. పీఎం కిసాన్ పథకానికి ఈనెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.5,500 జమ అయిందని, దీనిని పంటల సాగుకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తవణంపల్లె: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..గోవిందరెడ్డిపల్లెకు చెందిన అమర్‌నాథ రెడ్డి కట్టకిందపల్లె సమీపంలో ఉన్న బహుదానదిలో మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తుండగా స్వరాజ్ ట్రాక్టర్ (ఏపి 03 సిడి1138)ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

ప్రతి ఇంటికీ వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత



గుడిపాల: బొమ్మసముద్రంలో..

కుప్పిగానిపల్లెలో..

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు, మంగళవారం వీయస్.అగ్రహారంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని కుప్పిగానిపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. మధుమేహం, బీపీ రోగులతోపాటు గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. కార్యక్రమంలో బొమ్మసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి రష్మిత, వైద్యసిబ్బంది శిల్ప, శ్రీలత, శివగామి, కిరణ్‌కుమారి పాల్గొన్నారు.

కలిసికట్టుగా చిత్తూరు అభివృద్ధి

- సంతపేట పీఎన్‌సీ ఆవరణలో కేంద్రీయ పాఠశాల
- 8 ఎకరాల స్థలం కేటాయిస్తూ తీర్మానం
- కొంగారెడ్డిపల్లె, సంతపేట వద్ద కార్పొరేషన్ పెట్రోలు బంకులు
- పలు పనులకు మునిసిపల్ పాలక వర్గం ఆమోదం





సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ అముద, హాజరైన సభ్యులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి అందరూ కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని నగర మేయర్ ఎస్.అముద పిలుపునిచ్చారు. చిత్తూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం మేయర్ అధ్యక్షతన నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నిధులను వినియోగించుకుని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులను వేగంగా చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం మరి కొందరు కాంట్రాక్టర్లు ముందుకురావాలన్నారు.

ఏయే వాటిని ఆమోదించారంటే..

- కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి సంబంధించి మంగసముద్రం రెవెన్యూ గ్రామం సంతపేటలోని పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాల పక్కన 8 ఎకరాల స్థలం కేటాయింపు.
- వార్డు కార్పొరేటర్లు వారి డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ఇచ్చిన ప్రతిపాదనలను ఆమోదించారు.
- నగరపాలక సంస్థ పరిధిలో కూరగాయల మార్కెట్, ఎన్టీఆర్ బస్టాండ్, శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి బస్టాండ్, జంతువధశాలలకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరం సంబంధించి గుత్తలు వసూలు చేయడానికి వేలంలో హెచ్చు పాటదారుకు కేటాయించడానికి ఆమోదించారు.
- కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో క్యాంటీన్ ఏర్పాటుకు ఆమోదించారు.
- తిమ్మసముద్రం రెవెన్యూ గ్రామ సర్వే నంబర్ 475/19లోని రెండు ఎకరాల భూమిని స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల స్థాపన కోసం ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీకి బదలాయించడానికి ఆమోదించారు.
- కొంగారెడ్డిపల్లె, సంతపేట వద్ద మునిసిపల్ కార్పొరేషన్ ద్వారా పెట్రోలు బంకుల నిర్వహణకు ఆమోదం.
- కై లాసపురం శ్మశానవాటికలో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ (చిత్తూరు) ద్వారా క్రిమేషన్ మెషిన్ ఏర్పాటుకు ఆమోదం.
- పలమనేరు రోడ్డుకు మౌలాన అబుల్‌కలామ్ రోడ్డుగా, రామ్‌నగర్ కాలనీ టెలిఫోన్ వీధికి మదీనా మసీద్ వీధిగా మార్పు చేసినందుకు మైనారిటీ నేతలు సయ్యద్, అను తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మేయర్ అసహనం

కాగా ప్రతి వార్డులో కార్పొరేటర్లు ప్రతిపాదించిన పనులను ఆమోదించడానికి అజెండాలో ఉంచిన అంశాలపై డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అందరికీ పనులు సమానంగా ఇవ్వాలని, కానీ అందరికీ రూ.10 లక్షల వరకు పనులు ఇస్తూ 15వ డివిజన్‌లో రూ.32.50 లక్షలు, 17వ డివిజన్‌లో రూ.40 లక్షలు, 39వ డివిజన్‌లో రూ.40 లక్షలకు పనులు పెట్టడంపై మేయర్, కమిషనర్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. మరో కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ, సాధారణ పద్దులు తక్కువగా ఖర్చు చేయాలన్నారు. దీనిపై మేయర్ కాస్త అసహనం వ్యక్తం చేశారు. స్టాండింగ్ కమిటీల్లో చాలా వార్డులకు రూ.కోట్లలో పనులు ఆమోదించామని, వీటన్నింటినీ రద్దు చేసి తన డివిజన్‌లో కూడా రూ.10 లక్షల వరకు పనులు పెట్టాలని అధికారులకు సూచించారు. కూరగాయల మార్కెట్‌ను మార్కెట్ యార్డుకు తరలించాలని కార్పొరేటర్ వెంకటరమణ సూచించారు. కమిషనర్ డాక్టర్ జె.అరుణ, రాజేష్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమంలో మీరే టాప్ : టీడీపీ సభ్యుడు

మరోవైపు సమావేశంలో టీడీపీ కార్పొరేటర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాల్లో మీరే (వైఎస్సార్‌సీపీ) టాప్‌గా ఉందని తాను అంగీకరిస్తున్నట్టు చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో వార్డుకు రూ.కోటి ఇచ్చి అభివృద్ధి చేశారని చెప్పగా, అది జన్మభూమి కమిటీల పేరిట జరిగిన అవినీతికి నిదర్శమని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మండిపడ్డారు.

ఘనంగా గంగజాతర



బంగారుపాళెం : అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న మహిళలు, విశేషాలంకారంలో మాతమ్మ



దిగువమోదలపల్లెలో గంగమ్మకు అంబలి పోస్తున్న గ్రామస్తులు

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లె కాలనీలో మంగళవారం నడివీధి గంగజాతరను వైభవంగా నిర్వహించారు. ఉదయం గంగమ్మకు అంబలి పోశారు. తొలుత మాతమ్మకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రిలో నడివీధిలో గంగమ్మను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఆది ఆంధ్రవాడలో..

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆండారెడ్డిపల్లె ఆది ఆంధ్రవాడలో మంగళవారం మాతమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం మాతమ్మకు అంబలి పోశారు. సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. బుధవారం రాత్రి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తామని గ్రామస్తులు చెప్పారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజన్నాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: ప్రభుత్వ బడుల్లో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం విధిగా పెట్టాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. మంగళవారం మండలంలోని బైటపల్లె పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, కూరగాయలు శుభ్రపరచి వండాలని వంటసిబ్బందికి సూచించారు. అనంతరం పంచాయతీలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీ నుంచి వెలువడే నీరు పక్కనున్న చెరువులో కలవడంతో చేపలు మృతి చెందాయని చెప్పారు. దీనిపై ఫ్యాక్టరీ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. అనంతరం జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. ప్రజల సమస్యలను యాప్‌లో నిక్షిప్తం చేయాలని వలంటీర్లు, గృహసారథులను ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఎం.పైపల్లె హెచ్ఎం అరుణ్‌కుమార్

ఐరాల: ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎం.పైపల్లె హెచ్ఎం అరుణ్‌కుమార్ అన్నారు. ఎం.పైపల్లె జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగాల వీడియోల ప్రదర్శించి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తల్లిదండ్రులకు వివరించారు. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలను ప్రభుత్వం సమూలంగా మార్చివేసిందని, జగనన్న గోరుముద్దతో నాణ్యమైన భోజనం పెడుతున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అలాగే, స్థానిక ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం విజయలక్ష్మి పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.పైపల్లె పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ అనుపమ, వైస్ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఐరాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రవీంద్రరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి



గుడిపాల: వసంతాపురం సచివాలయంలో సేవలపై ఆరా తీస్తున్న స్పెషలాఫీసర్

పూతలపట్టు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహసారథులు విజయవంతం చేయాలని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో పోలవరం, పి.కొత్తకోట, గొడుగుచింత, చిటిపిరాళ్ల, వేపనపల్లె, తేనేపల్లె పంచాయతీలో సచివాలయాలను ఆయన సందర్శించారు. పంచాయతీలలోని గృహసారథులతో సమీక్షించారు. సర్వేను విజయవంతం చేసి, ప్రజలకు అవసరమైనవి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజారత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ పద్మజారాణి, ఎంపీటీసీ దేవిక, నిరంజన్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులకు జగనన్న సురక్షపై మండల స్పెషల్ ఆఫీసర్ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ బాబూ రాజేంద్ర ప్రసాద్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, కొన్ని పంచాయతీల్లో జగనన్న సురక్ష సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జూలై 1న జగనన్న సురక్ష కార్యక్రమం తొలుత వసంతాపురం సచివాలయంలో నిర్వహించనుండడంతో స్పెషలాఫీసర్ ఆ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఇప్పటివరకు 90 సేవలకు సంబంధించి ఆన్‌లైన్ చేశారని తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బబిత పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఉదయం దేవస్థానంలో సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అర్చకులు అభిషేకం,అలంకరణ, పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఉభయదారులు స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం చేయించి మొక్కులు చెల్లించారు. ఈ నెల 27 నుంచి జూలై 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు.

కబడ్డీ క్రీడాకారుడు మృతి



లోకేష్(ఫైల్)

పుంగనూరు: పట్టణంలో నివాసమున్న జాతీయ కబడ్డీ క్రీడాకారుడు లోకేష్(50) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందారు. లోకేష్ రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని, పలు అవార్డులు సాధించారు. మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైస్ చైర్‌పర్సన్ సీఆర్ లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు జయకృష్ణ, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రాయలసీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దిన్‌షరీఫ్ తదితరులు లోకేష్ మృతిపై సంతాపం తెలిపారు.